కరెంట్ కోతలతో ఇబ్బందులు

● కాలువ నీళ్లే రైతుల కష్టాలు తీర్చే

తాంసి, అక్టోబర్ 6 : తెలంగాణ రాక ముందు కరెంట్ కష్టాలు చెప్పలనవికాదు. ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతుండెనో కూడా తెలిసేది కాదు. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా పొలాల వద్ద కరెంట్ కోసం రైతులు పడిగాపులు కాసేవారు. స్వరాష్ట్రం వచ్చాక కేసీఆర్ ప్రభుత్వం కరెంట్ కష్టాలను తీర్చింది. రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ ఇవ్వడంతో రెండు పంటలు సాఫీగా సాగు చేసుకున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే కరెంట్ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. దీంతో బోరు బావుల వద్ద రాత్రి పగలు తేడా లేకుండా వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాంసి మండలంలోని గ్రామాల్లో చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు నోచుకోకుండా ఉచిత కరెంట్ సక్రమంగా అందడం లేదు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందకపోవడంతో పంట పొలాల్లో క్రిమిసంహారక మందు పిచికారీ చేసేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. నీళ్లున్నా సక్రమంగా కరెంట్ లేక రైతులు ఎడ్ల బండ్లపై చెరువులు, కాలువల ద్వారా నీటిని తెచ్చుకొని పొలం పనులు చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని రైతులు, విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

వ్యవసాయ పనులకు ఎడ్ల బండిపై కాలువ నీరు తీసుకెళ్తున్న తాంసి రైతులు

వ్యవసాయ పనులకు చెరువులో నుంచి నీరు ఎడ్ల బండిపై తీసుకెళ్తున్న పొన్నారి రైతు

ఉచిత కరెంట్ ఉత్తిదేనా..

కేసీఆర్ ప్రభుత్వంలో కరెంట్ కష్టాలు అసలే లేకుండే. కాంగ్రెస్‌కు ఓట్లేసి ఎందుకు గెలిపించారని రైతులు అంటుంటే ఉచిత కరెంట్ ఉత్తిదే అన్నట్లు ఆ మాట నిజమైంది. గతంలో వారంలో రెండుసార్లు కరెంట్ ట్రిప్ అవుతుండే ఇప్పుడు ఒక రోజులో 10 సార్లు కరెంట్ ట్రిప్ అయి మాటిమాటికి పోతుంది. రాత్రి పూట పత్తి చేనులో నీళ్లు పెట్టడానికి జాగారం చేయాల్సి వస్తుంది. రైతులకు కరెంట్ పోకుండా కంటికి రెప్పలా కాపాడిన కేసీఆర్ సర్ యాదికస్తుండు. - అండె ఆనంద్, రైతు, పొన్నారి , మండలం తాంసి

తొమ్మిది నెలలు గడిచిన సమస్య తీరలేదు

గతేడాది మా జామిడి రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైంది. కరెంట్ స్తంభాలు కూడా వచ్చాయి. ఇప్పటి దాకా ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు బిగించి కరెంట్ ఇవ్వలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇబ్బంది లేకుండే. తొమ్మిది నెలలు గడిచిన మా సమస్య తీరలేదు. వచ్చిన స్తంభాలు ఆ అధికారులే తిరిగి పట్టుకెళ్లారు. ఇప్పుడేమో లోడుతో కరెంట్ ఆగుత లేదు.

- గడ్డం నిఖిల్ రెడ్డి, రైతు, జామిడి గ్రామం, తాంసి మండలం

నిరుపయోగంగా పల్లె దవాఖాన భవనం

నిర్మించారు.. వదిలేశారు..

ఇచ్చోడ మండలం నర్సాపూర్ గ్రామంలో పల్లె దవాఖాన ఆయుష్మాన్ భారత్ భవనాన్ని రూ.23 లక్షలతో గతేడాది నిర్మించారు. దీనిని వినియోగించుకోకపోవడంతో చుట్టు పక్కల ముళ్ల పొదలు పెరిగిపోయాయి. రూ.లక్షలతో నిర్మించిన భవనాన్ని తెరవకపోవడంతో నిర్మానుష్యంగా మారింది. భవనాన్ని తెరిపించి వైద్య సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

-ఇచ్చోడ, అక్టోబర్ 6

లక్ష్మీపూర్ గ్రామస్తుల ఆత్మీయ సమ్మేళనం

ఒకే వేదికపై లక్ష్మీపూర్ గ్రామస్తులు

ఎదులాపురం, అక్టోబర్ 6 : జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామస్తుల సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. ఆదిలాబాద్‌లోని దస్నాపూర్‌లో గల మినీ తనీషా గార్డెన్‌లో లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన 127 కుటుంబాలు ఒకే చోట చేరి సందడి చేశారు. చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా పలువురిని సత్కరించారు. ఏళ్లుగా వివిధ కారణాలతో ఆదిలాబాద్‌లో నివాసముంటున్న వారిని ఒకే వేదికపై చేర్చాలని ఈ సమ్మేళనం నిర్వహించడం జరిగిందని గ్రామ మాజీ సర్పంచ్ తిరుపతి తెలిపారు. డిసెంబర్‌లో గ్రామంలో నిర్వహించనున్న రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆర్థిక వనరుల సేకరణతో పాటు గ్రామస్తులు ఒకరికి ఒకరు మరింత చేరువవుతారని సమ్మేళనం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మోర విఠల్‌రావ్, స్వామి, లక్ష్మి, గౌతం, గంగారాం, శివాజీ, విఠల్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 6 : దసరా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం నిర్మల్‌లోని బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ పరిసరాల్లో నిర్వహించే దసరా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగకు బంగల్‌పేట్ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా బారికేడ్లు, ఇతర సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని నందిగుండం దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట చైర్మన్ ఈశ్వర్, నాయకులు, అధికారులు ఉన్నారు.

ఆలయంలో పూజలు చేస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

అడెల్లి ఆలయంలో పూజలు చేసిన ఎమ్మెల్యే

సారంగాపూర్, అక్టోబర్ 6: మండలంలోని శ్రీ మహా అడెల్లి పోచమ్మ ఆలయాన్ని ఆదివారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యేకు దేవాదాయ శాఖ తరపున ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బాల ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకుడు శ్రీనివాస్‌శర్మ ఎమ్మెల్యేకు హారతిని అందించారు. ఇక్కడ ఈవో రమేశ్, బీజేపీ నాయకులు చంద్రప్రకాశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, నారాయణ, బడి పోతన్న, నానక్‌సింగ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆలయానికి మైక్‌సెట్ అందజేత

భైంసాటౌన్, అక్టోబర్ 6 : వానల్‌పాడ్ గ్రామ సమీపంలో గల చింత చెట్టు దుర్గమాత ఆలయానికి ఆదివారం గ్రామ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున రూ.50వేల విలువ గల మైక్‌సెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులుదశరథ్, గణపతి, భోజారాం, భూమన్న, శ్రీనివాస్ రెడ్డి, రమణా రెడ్డి, అంజయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కి వినతి

భైంసా, అక్టోబర్ 6 : హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్‌లో కేంద్ర సహాయక హోంమంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. భైంసాలో హిందువులపై బనాయించిన అక్రమ కేసులు తీసివేయాలని వినతి పత్రం అందించారు. అనంతరం పై అధికారులకు ఫోన్‌లో మాట్లాడారు. వినతి పత్రం అందించిన వారిలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు గోపాల్ సర్దా, ప్రవీణ్, పెండెపు కాశీనాథ్, దత్తు, శివ, శ్రీకాంత్ దగ్దే, లంక గంగాధర్, రావుల రాము, చింత పండు మహేశ్, సుందర్‌భయ్యా ఉన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

పెంబి, అక్టోబర్ 6 : మండల కేంద్రానికి చెందిన ఉర్లగొండ వెంకటనర్సయ్య కాలుకు గాయం కావడంతో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. వెంకటనర్సయ్య నిరుపేద కుంటుంబం కావడంతో తోటి స్నేహితులు రూ.11 వేలు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో జోగు రమేశ్, మోహన్, రమేశ్ పాల్గొన్నారు.

గంగనీళ్ల జాతరలో పాల్గొన్న ఎస్పీ

సారంగాపూర్, అక్టోబర్ 6 : మండలంలోని శ్రీ మహా అడెల్లి పోచమ్మ గంగనీళ్ల జాతరలో ఆదివారం నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల పాల్గొన్నారు. జాతరలో, అమ్మవారి నగలు వెంట భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి నగలను ఎస్పీ జానకి షర్మిల ఎత్తుకొని కొద్దిసేపు నడిచారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్, అక్టోబర్ 6 : గాదిగూడ మండలం ఝరి గ్రామంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పోలీస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇక్కడ సీఐ రహీంపాషా ఉన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాడాలి

ఎదులాపురం, అక్టోబర్ 6 : కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని విశ్రాంత కార్మిక శాఖ అధికారి చిట్యాల జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని నేతాజీ చౌక్‌లో దుకాణాల్లో పని చేసే కార్మికులకు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మికులకు కల్పిస్తున్న పథకాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

తప్పుడు వార్తలు పోస్ట్ చేస్తే చట్టరీత్యా చర్యలు

బోథ్, అక్టోబర్ 6 : సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు పోస్ట్ చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని బోథ్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. మార్చినెలలో జరిగిన సంఘటనకు సంబంధించి కొంత మంది ఈ రోజు సోషల్ మీడియాలో పోస్టు చేయడం సరికాదన్నారు. నిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో కొంత తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అటువంటి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు తాంసి, భీంపూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

భీంపూర్, అక్టోబర్ 6 : తాంసి పీఏసీఎస్ కేంద్రంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ప్రారంభిస్తారని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మేకల నాగయ్య తెలిపారు. అనంతరం భీంపూర్ కేజీబీవీ అదనపు తరగతుల నిర్మాణానికి భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని మహిళ మృతి

ఇచ్చోడ, అక్టోబర్ 6 : రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం సరిగ్గా లేని మహిళ మృతి చెందినట్లు సీఐ భీమేశ్, ఎస్ఐ తిరుపతి తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్చోడలోని నిర్మల్ బైపాస్ వద్ద ఆదివారం ఎన్‌హెచ్ 44 రహదారిపై అందాజ వయస్సు 50–55 సంవత్సరాలు గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందింది. మహిళా మృతదేహన్ని రిమ్స్‌లోని మార్చురి గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఎవరైనా ఫొటోలు గుర్తుపట్టి ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు.

మారణాయుధాలు కలిగిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 6 : నిర్మల్‌లో అక్రమంగా మారణాయుధాలు కలిగిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్లితే.. చింతకుంట వాడ కాలనీకి చెందిన రాజేశ్ అనే వ్యక్తి ఓ రెస్టారెంట్‌ను నడిపిస్తున్నాడు. నిర్మల్‌లో గొడవలు జరిగినప్పుడు తన వంతుగా ఏదైనా ఆయుధం ఉండాలని భావించి గుర్తు తెలియని వ్యక్తి వద్ద కొనుగోలు చేశాడు. తల్వార్‌ను తన షాపులోని కౌంటర్ కింద దాచి ఉంచాడు. పట్టణ పోలీసులకు వచ్చిన పక్కా సమాచారంతో ఆ తల్వార్‌ను వేరే ప్రాంతం వద్ద దాచిపెట్టడానికి వెళ్తూ ఉండగా పోలీసులు అతడిని పట్టుకున్నారు. తల్వార్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

భైంసాటౌన్, అక్టోబర్ 6: భైంసా మండలం ఎగ్గాం గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి మహిళ పురిటి నొప్పులతో బాధపడుతుండగా వాహనం కోసం ఎదురు చూస్తుండగా అదే సమయంలో భైంసారూరల్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. వెంటనే స్పందించి పోలీసు వాహనంలో భైంసా ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పెట్రోలింగ్‌లో ఉన్న హెడె కానిస్టేబుల్ సురేశ్, కానిస్టేబుల్ శ్రీధర్‌రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 6 : ఖానాపూర్ శివారు ప్రాంతంలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తెలిపారు. సుభాష్‌నగర్‌లోని వాగ్దేవి డిగ్రీ కళాశాల దగ్గరలో వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహన్ని పరిశీలించగా అతని వివరాలు తెలిపే ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 45 నుంచి 50 ఏళ్లు ఉంటుంది. మృతదేహన్ని ఖానాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆచూకీ తెలిసిన వారు ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో గాని 87126 59524, 8712659523 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

నర్సాపూర్ (జీ), అక్టోబర్ 6 : నర్సాపూర్ (జీ)లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పాఠశాల తరగతి గదులు, ఆవరణ చుట్టూ కలియ తిరుగుతూ ఆనాటి గుర్తులు నెమరువేసుకున్నారు. నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిషన్ రావు, నాటి ఉపాధ్యాయులు చంద్రగౌడ్, రమేశ్, భోజారెడ్డి, శ్రీధర్ రెడ్డి, మోహన్ రావు, రాంమోహన్, కృష్ణమూర్తి, నర్సయ్య, భూమేశ్వర్, విద్యాసాగర్, విద్యార్థులు నిఖిల్, సాయి కృష్ణ, సంధ్య, డా. సంపద, శోభ, వనిత పాల్గొన్నారు.

ఘనంగా సర్గవ పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

తలమడుగు, అక్టోబర్ 6: పల్సి(బీ) గ్రామంలో ఆదివారం సవర్గ పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. శ్రీనివాస్, గంగారెడ్డి, లింగారెడ్డి, రవీందర్ రెడ్డి, భోజారెడ్డి, ప్రతాప్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-AII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం

200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి

50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

నిర్మల్: 91827 77671, 91827 77677

అటవీ శాఖ అధికారుల బైక్ ర్యాలీ

బైక్ ర్యాలీ తీస్తున్న అధికారులు

కడెం, అక్టోబర్ 6 : కడెం మండలం ఉడుంపూర్ రేంజ్ అధికారులు ఆదివారం బైక్ ర్యాలీ తీశారు. 70వ వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు గ్రామస్తులతో కలిసి ఉడుంపూర్ నుంచి దోస్త్‌నగర్ సమీపంలోని ఐ లవ్ కవ్వాల్ టైగర్ రిజర్వు లోగో వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా డీఆర్వో ప్రకాశ్ మాట్లాడుతూ అడవుల ప్రాముఖ్యత గురించి వన్యప్రాణుల సంరక్షణలో గడ్డి భూముల పాత్ర, ఇతర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వో సురేందర్, బీట్ అధికారులు ప్రసాద్, సరిత, అరుణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుమ్రం భీం వర్ధంతిని విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

నార్నూర్, అక్టోబర్ 6 : మండల కేంద్రంలో ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్న కుమ్రం భీం వర్ధంతికి ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, రాయిసెంటర్ జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గుపటేల్ పిలుపునిచ్చారు. మాన్కాపూర్ గ్రామంలో 47 గ్రామాల పెద్దలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం పోరాడిన కుమ్రం భీం వర్ధంతికి ఆదివాసీ అనుబంధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, మేధావులు, సమాజ పెద్దలు తరలిరావాలని కోరారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు యుర్వేత రూప్‌దేవ్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ తొడసం నాగోరావ్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మానిక్‌రావ్, మండలాధ్యక్షుడు శ్రీరామ్, మాజీ సర్పంచ్ మడావి రూప్‌దేవ్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు పుసం ఇస్రూ, పరమేశ్వర్, దాదిరావ్, దీపక్, అనుబంధ సంఘాల నాయకులు, గ్రామపటేళ్లు పాల్గొన్నారు.

మెస్రం మనోహర్‌కు సన్మానం

ఉట్నూర్, అక్టోబర్ 6: ఉట్నూర్ ఐటీడీఏ పీవీటీజీ ఏపీవోగా నియమితులైన మెస్రం మనోహర్‌ను ఆదివారం ఆయన నివాసంలో ఆదివాసీ నాయకులు కోట్నాక్ గణపతి, మనోహర్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీవీటీజీల ఐటీడీఏ పథకాలు అమలు చేస్తూ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మనోహర్‌ను శాలువాతో సన్మానిస్తున్న నాయకులు

రోడ్డుకు మరమ్మతులు

రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెంబి, అక్టోబర్ 6 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెంబి–శేట్‌పల్లి మార్గ మధ్యంలో రోడ్డు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతుంది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని బీఆర్‌ఎస్ నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయిన అధికారులు పట్టించుకోకపోవడంతో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు ఆదివారం గుంతలు పడ్డ ప్రాంతంలో మొరం పోయించి మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గాండ్ల శంకర్, రియాజ్, కౌట నరేందర్ పాల్గొన్నారు

భారతదేశం సంప్రదాయాలకు నిలయం

విద్యార్థులతో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, అక్టోబర్ 6: భారతదేశం భిన్న సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఓయోస్టర్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైబల్ అడ్వాయించరి క్యాంప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు ప్రకృతినే దైవంగా భావించి నిత్యం పూజలు చేస్తుంటారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీధర్, సునీల్, సోహెల్, రజిత, అరవింద్ పాల్గొన్నారు.

భీంరావ్‌కు సన్మానం

ఉట్నూర్, అక్టోబర్ 6: ఐటీడీఏ ఇంజినీరింగ్ ఈఈ రాథోడ్ భీంరావ్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో ఎంపీ నగేశ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాలో రెండు కోట్లతో బంజారా భవన్ మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి అమర్‌సింగ్ తిలావత్, జడ్పీ మాజీ చైర్మన్ జనార్దన్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పాల్గొన్నారు.

సన్మానిస్తున్న నాయకులు

సామాజిక సేవ బాధ్యతగా చేపట్టాలి

తలమడుగు, అక్టోబర్ 6: ప్రభుత్వ ఉద్యోగులు సామాజిక సేవ బాధ్యతగా చేపట్టాలని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆల్ ఇండియా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కాంతారావ్ అన్నారు. ఆదివారం పల్సి(బీ) గ్రామంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంక్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 15 గిరిజన గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా యూనియన్ యూత్ ప్రెసిడెంట్ రవీందర్‌నాథ్, శేఖర్, పంచాయతీ కార్యదర్శి సచిన్, మండల శాఖ మేనేజర్ శ్రీకాంత్, నేతుల గంగన్న, శ్రీనివాస్, డాక్టర్లు విజయ సారథి, నిఖిల్, పిల్లల వైద్య నిపుణులు హేమలత, గ్రామ మహాజన్ పటేల్ లచ్చరాం, పూసం బాపురావ్, కిసాన్ మహారాజ్ పాల్గొన్నారు.

నేతకాని సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 6 : గంగన్నపేట్ గ్రామంలో నేతకాని సంఘం నాయకులు నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా జాడి రాజేశ్వర్, ఉపాధ్యక్షుడిగా గొడిపెల్లి ఆశన్న ,ప్రధానకార్యదర్శిగా జాడి రాజేశ్వర్, కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా పవన్, కోశాధికారిగా లక్ష్మీపతి, దుర్గం దేవానందను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గొల్లపెల్లి నర్సయ్య, దూట మహేందర్, గవాస్కర్, ప్రవీణ్, సుభాష్, గంగరాజు, రాజేశ్వర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గంగనీళ్ల జాతర

సోన్, అక్టోబర్ 6 : సోన్ మండలం కడ్తాల్ గ్రామంలో ఆదివారం గంగనీళ్ల జాతర ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం గిన్నూరు గ్రామానికి చెందిన పోచమ్మ తల్లి ఆభరణాలను శనివారం సాయంత్రం కడ్తాల్ గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం తెల్లవారుజామున సోన్ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆభరణాలను శుద్ధి చేశారు. అనంతరం పాదయాత్రగా గ్రామానికి చేరుకున్నారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

క్రీడలు ఉత్సాహంగా నిర్వహించాలి

ఉట్నూర్, అక్టోబర్ 6: క్రీడలు ఉత్సాహంగా నిర్వహించాలని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ గౌడ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని ఎన్‌టీఆర్ గ్రౌండ్లో దసరా సెలవుల సందర్భంగా ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ మొగిళి, సామాజిక కార్యకర్త కేశవ్, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన

ఆలయంలో పూజలు చేస్తున్న దంపతులు

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 6 : నిర్మల్ పట్టణ శివారులోని సాకెరలో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లలితా సహస్రనామ కుంకు మార్చన పూజ వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆమెడ కిషన్ పాల్గొన్నారు.

ఏఎస్పీ పూజలు

భైంసా, అక్టోబర్ 6 : భైంసాలోని కిసాన్ గల్లిలో గల దుర్గామాత మండపాల వద్ద ఏఎస్పీ అవినాశ్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలోజరుపుకోవాలని సూచించారు. ఆయన వెంట సీఐ గోపీనాథ్, ఎస్ఐ, తదితరులు ఉన్నారు.